# శ్యామల



ప్రియమైన పల్లవికి,

ఎప్పటి కప్పుడు నీకు ఉత్తరం వ్రాయాలను కుంటూనే అశ్రద్ధ అయిపోతోంది. ప్రొద్దుట 7 గం॥ లకి శ్రీవారిని ఆఫీసుకి, తర్వాత పిల్లల్ని స్కూలుకి పంపించటం ఆ తర్వాత వంట ప్రయత్నం, మళ్ళీ పిల్లలు లంచ్ టైముకి యింటికి రావటం, మధ్యాహ్నం కాఫీలు, తిరిగి వంట ప్రయత్నంతో దిన కార్యక్రమం ముగిసిపోతోందనుకో.

మీకు బాబు పుట్టేడని రాశావు. వాడు ఇప్పుడు తప్పటడుగులు వేస్తున్నాడా? ఏమిటో తర్వాత నీ దగ్గర్నుంచి జాబేలేదు.

అన్నట్టు క్రిందటి వారం నేను, మా వారు ఎగ్జిబిషన్‌కి వెళ్ళినప్పుడు "పద్మజా" అంటూ వెనకాల నుంచి ఒక్క కేక వినేసరికి త్రుళ్ళి పడ్డాను. ఎవరా అని వెనక్కి తిరిగి చూసేసరికి, ఇంకెవరు మన గాలివాన శ్యామల.

శ్యామల వాళ్ళ ఆయన శేఖర్‌ని నాకు మా ఆయనకి పరిచయం చేసింది. వాళ్ళకి ఆరునెలల క్రిందట ఈ వూరు ట్రాన్స్‌ఫర్ అయిందిట. అక్కడకక్కడే పది నిమిషాల్లో ఎన్నో విషయాలు గడగడ మాట్లాడేసుకున్నాము. శ్యామల వాళ్ళ అడ్రస్ ఇచ్చి వాళ్ల యింటికి రమ్మని అడిగింది.

అయితే శ్యామలలో ముందు వుండే ఆ చురుకు, చిలిపితనం అన్నిటికి బదులు దైన్యం, బేలతనం చోటు చేసుకున్నాయా అనిపించింది.

ఒక రోజు మధ్యాహ్నం శ్యామలని కలుసుకోవాలని బయలుదేరాను. ఇల్లు కనుక్కోవడం కష్టం కాలేదు. వీధిలోంచే నన్ను చూసి ఆప్యాయంగా చెయ్యి పుచ్చుకుని లోపలికి తీసుకు వెళ్ళింది. ఆ మాట, ఈ మాట అయిన తరువాత నెమ్మదిగా శ్యామలని కదిపాను — ఉదాసీనానికి కారణం ఏమిటని.

అప్పుడు శ్యామల చెప్పింది. తన భర్త శేఖర్ గవర్నమెంట్ ఆఫీసులో సూపరింటెండెంటనీ శేఖర్‌కి ఒక్కగానొక్క అక్క సుభద్ర, అక్కకి ఒకే ఒక కూతురు నిర్మల అనీ. చిన్నతనంలో శేఖర్‌కి నిర్మల నిచ్చి వివాహం చెయ్యాలని సుభద్రకి




ఉండేదట. అయితే శేఖర్ బావగారు రామనాధంగారు బిజినెస్ మాగ్నట్ కావడంతో, నిర్మల ఒకే సంతానమవడంతో గారాబంగా పెరిగింది. శేఖర్ అక్క సుభద్రకు కూడా రాను రాను డబ్బు మీద వ్యామోహం పెరిగి, భోగ భాగ్యాలతో సుకుమారంగా పెరిగిన కూతురు నిర్మలని సామాన్య జీతగాడైన శేఖర్‌తో సుఖపడలేదన్న అభిప్రాయంతో, తమ్ముడి మీద అభిమానమున్నా తమ హోదాకు సరిపడదని శేఖర్‌కి యిచ్చే అభిప్రాయం వెలిబుచ్చలేదు.

నిర్మలను రామనాధంగారి వ్యాపారంలో భాగస్వామి, స్నేహితుడైన విశ్వనాథం కుమారుడు ప్రమోద్ కిచ్చి అతి వైభవంగా వివాహం చేశారు. ప్రమోద్ ఇంజినీర్. కొత్త దంపతుల జీవితం నెల్లాళ్ళు బాగా సాగింది. ఒక రోజు పని మీద వెళ్ళిన ప్రమోద్ యాక్సిడెంట్‌లో మరణించాడు. నిర్మల జీవితం అంధకారమైంది. ప్రమోద్ మరణంతోను, వ్యాపారంలో తట్టుకోలేని నష్టాల వల్ల బెంగతో మంచం పట్టి నెల్లాళ్ళకి రామనాధం గారు మరణించారు. రామనాధంగారి మరణంతో వాళ్ళ వ్యాపారం, కుటుంబం చెల్లాచెదరవడంతో దర్జాలకు అలవాటైన సుభద్రమ్మకు, నిర్మలకు శేఖర్ ఒక్కడే దిక్కయ్యాడు. శేఖర్ అక్కను, నిర్మలను తన యింటికి తీసుకు వచ్చి ఆదరించ సాగాడు. పాపం మన శ్యామల కూడా వాళ్ళని ఎంతో అభిమానంగా మర్యాదగా చూడసాగిందిట.

అయితే సుభద్రమ్మలోను, నిర్మలలోను, శ్యామల మీద క్రమేణా ఈర్ష్యా ద్వేషాలు మొదలైనాయట. శ్యామల మంచి చీర కట్టుకున్నా నగలు పెట్టుకున్నా సుభద్ర అనరాని మాటలు అనేదట. "ఇవన్నీ మా నిర్మల అనుభవించవలసినవి. దానికి యోగం లేకుండా పోయింది. నీ భోగం బాగుంది. నీ రొట్టె విరిగి నేతిలో పడిందని". సాధారణంగా సినిమాలకి వెళ్ళినా, మార్కెట్‌కి వెళ్ళినా నలుగురూ కలిసి వెళ్ళేవారట. ఖర్మం కాలి ఎప్పుడేనా శేఖర్ శ్యామల ఇద్దరూ వెళ్ళితే శ్యామల శేఖర్‌కి మందు పెట్టేసిందనో, చీరకి ముడి వేసుకుని కుక్కని తిప్పినట్టు తిప్పుతుందనో నానా మాటలు సుభద్ర అనేదిట. శేఖర్ యింట్లో వున్నప్పుడు మాత్రం తల్లీ, కూతుళ్ళు శ్యామల మీద ఎక్కడలేని అప్యాయత చూపేవారట. పాపం, శ్యామల భరించినంతకాలం భరించి ఆవేదనతో కృశించి పోవడం ప్రారంభించిందిట.

ఒక రోజు శేఖర్ శ్యామలని అడిగాడట. "ఏం శ్యామలా ఈ మధ్య చాలా ఉదాసీనంగా వుంటున్నావు? మీ వాళ్ళని చూడాలని వుందా? కావాలంటే పది రోజులు వుండిరా" అని. అప్పుడు మన శ్యామల చాలా తెలివిగా శేఖర్‌తో చెప్పిందిట. ఇల్లు యిరకాటంగా వుందని, సుభద్రని, నిర్మలని వేరే ఎక్కడైనా యిల్లు అద్దెకి తీసుకుని ఉండమంటే బాగుంటుందని, వాళ్ళకి అయ్యే ఖర్చు ప్రతి నెలా యిస్తే బాగుంటుందని. శేఖర్ ఏమనుకున్నాడో ఏమో సరే అన్నాడట. వచ్చేవారమే వాళ్ళు వేరే యింటికి వెళ్తారని శ్యామల చెప్పింది. నిజానికి వాళ్ళు వెళ్తే మన శ్యామల ఘటికురాలు అనవచ్చు. ఎలాగో మంచి మాటలతో చెడ్డనిపించుకోకుండా పరిస్థితులు చెయ్యి జారనివ్వకుండా, మంచి ప్లాను వేసి వాళ్ళని వదల్చుకుంది. శ్యామల సంసారం గురించి చాలా రాశాను. వీలైతే దానికి ఒక ఉత్తరం రాయి, సంతోషిస్తుంది. ఇప్పటికే చాలా రాశాను. వీలు చూసుకుని జాబు వ్రాయి.

నీ ప్రియమైన
పద్మజ

— ఓ. వి. లక్ష్మి